నవతెలంగాణ
1
మెదక్
శుక్రవారం | 14 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



నవతెలంగాణ-పుల్కల్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి ఇంపాక్ట్ ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ కె రాజేశ్వర్ ఇంపాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు అలవాట్లు, సమయ నిర్వహణ తదితర విషయాలను వివరించారు. బాడీ లాంగ్వేజ్ ఎలా ఉండాలి, భావోద్వేగాలు ఎలా కంట్రోల్ చేసుకోవాలి, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, పరీక్షల సమయంలో ఒత్తిడి ఎలా తట్టుకోవాలి, మంచి ఫలితాలు సాధించడానికి ఎలా ప్రణాళిక వేసుకోవాలి, లక్ష్యం ఎలా చేరుకోవాలి తదితర అంశాల గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆగమయ్య, శ్రీనివాస్, పాఠశాల బృందం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన గ్రంథాలయ చైర్మన్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని తహసిల్దార్ గ్రౌండ్ పక్కన ఉన్న గ్రంథాలయాన్ని గురువారం సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంజయ్య, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డిలు సందర్శించారు. అనంతరం వారు గ్రంథాలయానికి చదవడానికి వచ్చిన విద్యార్థులతో ముచ్చటించి గ్రంథాలయంలో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా..? అని ఒకవేళ లేకపోతే అందుబాటులో లేని పుస్తకాలను తీసుకొని రావాలని గ్రంథాలయ అబ్జర్వర్ సూచనలు ఇచ్చారు. తమ ప్రభుత్వం తరపున గ్రంథాలయానికి ఏలాంటి సౌకర్యాలు కావాలన్నా ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, రాయికోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జగదీశ్వర్, సిద్ధారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ విడుదల చేయాలి

అద్దె భవనంలో కొనసాగుతున్న హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణి



నవతెలంగాణ- నారాయణఖేడ్ రూరల్

పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, అద్దే భవనంలో కొనసాగుతున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవోకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గర్ల్స్ జిల్లా కన్వీనర్ వాణి మాట్లాడుతూ నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో బీసీ ప్రైమరీ సంక్షేమ హాస్టల్, బిసి, మైనార్టీ గురుకులాలు అద్దే భవనంలో కొనసాగడం వల్ల విద్యార్థులకు సరైన వసతులు లేవన్నారు. అలాగే ఎస్సీ కళాశాల గర్ల్స్ హాస్టల్ శిధిలావ్యవస్థకు చేరుకోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. కావున వచ్చే విద్యాసంవత్సరం వరకు సొంత భవనం నిర్మించే విధంగా చూడాలన్నారు. అలాగే పెండింగ్లో నాలుగు సంవత్సరాలు నుండి విద్యార్థులకు స్కాలర్షిప్ రాక విద్యాని అభ్యసించడానికి ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతూ చాలామంది విద్యకు దూరమైతున్న పరిస్థితి ఉందన్నారు కావున పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ విడుదల చేయాలని ఇచ్చే విషయం ప్రభుత్వం తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కమిటీ సభ్యులు లక్ష్మి, సువర్ణ, మమత, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా గుట్టురట్టు

-పగలు వ్యాపారం రాత్రి వేళల్లో దొంగతనాలు
-కర్ణాటకకు చెందిన దొంగల బ్యాచ్
-దొంగలను పట్టుకొని చితకబాదిన గ్రామస్తులు
-పుల్కల్ పోలీసులకు అప్పజెప్పిన గ్రామస్తులు



నవతెలంగాణ-పుల్కల్

ఒక దొంగల ముఠా గుట్టు రట్టయింది. పుల్కల్ మండలంలోనే కాకుండా ఇతర మండలాల్లో కూడా ఈ దొంగల ముఠా గత పది రోజుల నుంచి వట్‌పల్లి మండలంలో రెండు బైకులు అలాగే ఆందోల్ మండలంలోని బ్రాహ్మణపల్లి చౌరస్తా వద్ద తాళం వేసి ఉన్న ఒక షట్టర్లో నుంచి రెండు బైకులు దొంగలించారు. దొంగలించిన బైకులపై వీరు పుల్కల్ మండలంలోని మంతూర్, రాయిపాడు, పెద్ద రెడ్డి పేట గ్రామాల్లో పగలు చెడిపోయిన గ్యాస్ స్టవ్వులు, బీరువాలు, రిపేర్ చేస్తామంటూ గ్రామాల్లో తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి రాత్రి వేళల్లో అట్టి ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పెద్దరెడ్డిపేట గ్రామ యువకులు గ్రూపులుగా విడిపోయి గురువారం తెల్లవారుజామున అట్టి దొంగల ముఠాను పట్టుకొని కట్టివేసి గ్రామస్తులు చితకబాదారు. అట్టి మూఠలో ఇద్దరు యువకులు ఒక మహిళ ఉన్నారు. వీరిని ప్రశ్నించగా తాము కర్ణాటకకు చెందిన వ్యక్తులమని వారి వద్దనున్న ఆధార్ కార్డులను పరిశీలిస్తే తెలిసిందని పెద్దరెడ్డిపేట గ్రామ యువకులు తెలిపారు.ఆ దొంగల ముఠాను పుల్కల్ పోలీసులకు అప్పజెప్పడం జరిగిందన్నారు. దీంతో పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వీరు ముమ్మాటికి నేరస్తులే అని తెలిశాక వీరిపై కేసు నమోదు చేసి జోగిపేట సబ్ కోర్టుకు రిమాండ్ కు పంపించామన్నారు.

సర్వేయర్‌పై దాడి

నవతెలంగాణ-పాపన్నపేట

భూమిని సర్వే చేసి తిరిగి వస్తున్న సర్వేయర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... మండలంలో సర్వేయర్ గా విధులు నిర్వహిస్తున్న హహెూబిలం శ్రీనివాస్ ఇదే మండలం యూసుఫ్ పేట గ్రామానికి చెందిన తీగల మల్లేశం అనే వ్యక్తి భూమిని సర్వే చేయడానికి బుధవారం యూసుఫ్ పేట గ్రామానికి వెళ్ళాడు. సర్వే చేసి తిరిగి వస్తుండగా గ్రామ బస్టాండ్ సమీపంలో అదే గ్రామానికి చెందిన ఎరుపుల శ్రీనివాస్, ఎరుపుల గంగయ్యలు సర్వేయర్ బైక్‌ను ఆపి భూతు మాటలు తిట్టి చేతులతో, హెల్మెట్ తో ముఖంపై కొట్టారు. సర్వేయర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాపై నాయకులతో సమావేశం



నవతెలంగాణ-తూప్రాన్

మండలంలో జెడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధిం చిన ఓటర్ జాబితా పైన రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఎంపీఓ సతీష్ సమావేశాన్ని నిర్వహించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ఓటర్ జాబితాలోని మార్పులు, చేర్పుల విషయాలపై రాజకీయ నాయకులతో పలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు హరీష్ గౌడ్, సురేష్, సతీష్, తదితరులు హాజరయ్యారు.

పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ల పంపిణీ





నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ పరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ జి.స్వప్న సహకారంతో అమ్మనాన్న లేని అనాధ విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశామన్నారు. గతంలో నోటు పుస్తకాలు, వార్షిక పరీక్షా ఫీజు చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలనే ఉద్దేశ్యంతోనే సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ గుబాలించేనా..!



- ఉమ్మడి మెదక్ జిల్లాలో పునాది చెదరకుండా జాగ్రతలు
- ఎమ్మెల్యే గూడెం చేజారినా...కాంగ్రెస్‌లో అసమ్మతే
- గజ్వేల్‌లో భారీ సభకు ప్లాన్
- 19న పార్టీ సమావేశానికి కేసీఆర్ కసరతు
- సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టుల కోసం హరీశ్‌రావు పాదయాత్ర
- ఇటీవల జహీరాబాద్ క్యాడర్‌తో కేసీఆర్ బేటీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

14 ఏళ్ల ఉద్యమ ప్రస్తానం...10 ఏళ్ల పరిపాలనా అనుభవం కల్గిన గులాబీ పార్టీ మళ్లీ గుబాలించేందుకు కసరత్తు చేస్తోంది. ఏడాదికి పైగా వ్యవసాయ క్షేత్రానికే పరిమితమైన మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజా క్షేత్రంలోకి వస్తున్నట్లు ప్రకటించారు. తన నియోజకవర్గం నుంచే యాక్టీ రోల్ ప్రారంభించేందుకు భారీ బహిరంగ సభ జరపనున్నట్లు ఆయనే స్వయంగా ప్రకటించారు. అంతే కాదు రాష్ట్ర స్థాయిలో ఈ నెల 19న పార్టీ సమావేశం నిర్వహించాలని కూడా నిర్ణయించారు. మరో పక్క మాజీ మంత్రి హరీశ్‌రావు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పెండింగ్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘ పాదయాత్ర చేసేందుకు సన్నద్దమవుతున్నారు. జహీరాబాద్ లీడర్లు, క్యాడర్‌తో కేసీఆర్ ఇటీవల తన ఫాంహౌస్‌లో ప్రత్యేకంగా సమావేశమై బూస్టింగ్ ఇచ్చారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూ ప్రజల్లో సానుభూతిని పెంచుకునేందుకు యాక్టీవ్ అవుతోంది.

పెండింగ్ ప్రాజెక్టుల కోసం పాదయాత్ర

ప్రాజెక్టు నిర్మాణలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్షాన్ని ఎత్తిచూపడమే కాకుండా తమ హయాంలో ప్రారంభించిన పనుల్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు పాదయాత్రకు సిద్దమవుతున్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్, ఆందోల్, సంగారెడ్డి నియోజక వర్గాలోని బీడు భూములకు సింగూరు జలాలను అందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4 వేల కోట్ల వ్యయంతో సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టు పథకాల్ని ప్రారంభించింది. కొంత మేరకు పనులు కూడా జరిగాయి. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో అది కారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలుత ఆ రెండు లిఫ్టు పథకాల్ని రద్దు చేస్తున్నట్లు చెప్పింది. తర్వాత రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందన్న నెపంతో పనుల్ని కొనసాగిస్తామని చెప్పింది. 14 నెల్ల గడుస్తున్నా తట్టెడు మట్టితీయలేదు. హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు తన చేతుల మీదిగా పనుల్ని ప్రారంభించారు. కరువు ప్రాంతాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన రెండు లిఫ్టు పథకాల్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ హరీశ్‌రావు 35 గ్రామాల్ని కలుపుతూ పాదయాత్ర చేయాలని ప్లాన్ చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం లేనందున పాదయాత్ర షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించే అవకాశముంది. నల్లవలిల డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ యాక్టీవ్‌గా ఏజేసీలో పనిచేస్తుంది. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అరెస్టు అవ్వడం, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడం ద్వారా గుమ్మడిదల ప్రాంతంలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లేకపోయినా క్యాడర్‌కు అండగా సునీతాలక్ష్మారెడ్డి నిలుస్తున్నారు.

గజ్వేల్‌లో భారీ బహిరంగ సభకు ప్లాన్

ఇటీవల జహీరాబాద్ నియోజకవర్గం పార్టీ శ్రేణులతో ఫాం హౌస్‌లో ప్రత్యేకంగా సమావేశమైన కేసీఆర్ మాట్లాడుతూ తాను దెబ్బ కొడితే బలంగా ఉంటుందని చెబుతూనే గజ్వేల్‌లో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ జరపన్నుట్లు ప్రకటించారు. గజ్వేల్ కేంద్రంగా మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావడమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా ఆయన అక్కడ కూడా తిరుగుబాటు వ్యవహారాలు నడుపుతున్నారు. మిగతా ముగ్గురు కూడా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బలంగా గొంతు వినిపిస్తున్నారు. ఇటీవల రైతు ధర్నాలు, డంపింగ్‌యార్డ్ వ్యతిరేక కార్యక్రమాలు, ప్రజా పాలన, ఆరు గ్యారంటీల వంటి అంశాలపై సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట ఎమ్మెల్యేలు యాక్టీవ్‌గా పాల్గొన్నారు.

చేజారిన పార్టీ నాయకులు

అధికారం కోల్పోగానే బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీలు, కార్పొరేషన్ చైర్మెన్లతో పాటు ఒక ఎమ్మెల్యే సైతం పార్టీ వీడారు. కాంగ్రెస్‌లో చేరిపోయారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మెన్, జహీరాబాద్‌లో తన్వీర్, సిద్దిపేటలో డీసీసీబీ చైర్మెన్, ఇతర నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వలసలు జోరందుకున్న వేళ పార్టీని కాపాడుకునేందుకు హరీశ్‌రావు దుకుడు పెంచారు. పార్టీలో ఉండడం ద్వారానే భవిష్యత ఉంటుందన్న సంకేతాలివ్వడమే కాకుండా పార్టీ శ్రేణుల్ని కాపాడుకునేందుకు అండగా నిలబడ్డారు. అసెంబ్లీలో జరిగిన చర్చల్లో కాంగ్రెస్‌ను ఎదుర్కొవడం, ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపడంతో పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని నింపడం ద్వారా వలసలకు బ్రేక్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికలొస్తే క్షేత్ర స్థాయి లీడర్లు కాంగ్రెస్ వైపు చూసే అవకాశముండేది. ఎన్నికలు ఇంతలో జరిగే అవకాశం లేనందున పార్టీని యాక్టీవ్ చేయడం కోసం ప్రజల సమస్యలపై ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

డంపింగ్ యార్డ్ పూర్తిగా రద్దు చేయాలి

- పది రోజుల నుంచి ప్రజలు ఉద్యమిస్తుంటే జిల్లా కలెక్టర్ ఎందుకు రావడం లేదు
- పోలీసు చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ఎస్పీకి విజ్ఞప్తి
- డీఎఫ్ఓ, పీసీబీ వాళ్ళు నిద్రపోతున్నారా..? వీరిపైన కేసులు నమోదు చేయాలి
- గుమ్మడిదల, నల్లవల్లి నిరవధిక సభల్లో సీపీఐ(ఎం) నేత కే.రాజయ్య
- పోరాటానికి సీపీఐ(ఎం), సీఐటీయూ మద్దతు





నవతెలంగాణ-గుమ్మడిదల

డంపింగ్ యార్డ్ పూర్తిగా రద్దు చేయాలని సీపీఐ(ఎం) నేత కె. రాజయ్య అన్నారు. గుమ్మడిదల, నల్లవల్లిలో జరిగిన నిరవధిక సభలో కె. రాజయ్య పాల్గొని గ్రామస్తుల పోరాటానికి మద్దతుగా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. గురువారం నాటికి పది రోజుల నుంచి 13 గ్రామాల్లో ఆందోళన జరుగుతున్న పోరాటం అభినందనీయమన్నారు. అలాగే ప్రజలు ఉద్యమిస్తుంటే జిల్లా కలెక్టర్ ఎందుకు రావడం లేదని, నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. వెంటనే కలెక్టర్ ప్రజలతో మాట్లాడాలని, గ్రామ సభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే మొత్తం ఈ ప్రాంతంలో ఉన్న పోలీస్ చెక్‌పోస్టులన్నీటిని ఎత్తివేయాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. శాంతియుతంగానే ఆందోళన కొనసాగిస్తారని ఇప్పటి వరకు అలాగే చేశారని, భవిష్యత్తులో కూడా అలాగే చేస్తారన్నారు. అందుకే వెంటనే చెక్‌పోస్టులను ఎత్తివేయాలన్నారు. అడవిలో పశువులు మేస్తే, కట్టెలు తెచ్చుకున్న కేసులు పెట్టె ఫారెస్ట్ అధికారులు ఏకంగా డంపింగ్ యార్డ్ కోసం రోడ్డు వేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఫారెస్ట్ చట్టాన్ని తుంగలో తోక్కిన డీఎఫ్ఓపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీసీబీ అధికారులు అవినీతిమయమయ్యారని సూట్ కేసులకు అలవాటు పడ్డారని, వాళ్ళు ఏ ఒక్క గ్రామాన్ని కూడా ఎందుకు సందర్శించలేదని ఆరోపించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళ్ళు డంపింగ్ యార్డ్‌కు అనుకూలంగా రిపోర్ట్ ఇస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ వస్తే కాలుష్యం అవుతుందని వాయు కాలుష్యం, భూగర్భ జలాలు, చెరువులు తాగునీరు మొత్తం కాలుష్యం అవుతాయని రాబోయే తరాలు వికలాంగులగా పుట్టబోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా పోరాటాలు కనిపించడం లేదా అని అన్నారు. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య అన్నారు. కనీసం ఒక్క జిల్లా అధికారి కూడా ఎందుకు పర్యటన చేయట్లేదని, ఏం చేస్తున్నారని ప్రశ్నించారు ప్రజలు బాధలతో రోడ్ల మీదకు వచ్చి నిరసన చేస్తుంటే కంటికి కనిపించడం లేద అని సూటిగా ప్రశ్నించారు. అనేక గ్రామ ప్రజలు ఆందోళన చెందుతుంటే గ్రామాల్లో సభలు ఎందుకు నిర్వహించలేదని, ప్రజలకు వాస్తవాలు ఎందుకు చెప్పడం లేదన్నారు. గ్రామ సభలు పెట్టకుండా, ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా డంపు యార్డ్ ఆగ మేఘాల మీద పోలీసుల ద్వారా బందోబస్తు పెట్టి నిర్మిస్తున్నరంటే ఏదో దాగి ఉందని అర్థం కాదా..? ఏమి గాక పోతే ఏమి సమస్య లేకపోతే ఇంత పోలీసు నిర్బంధం ఎందుకని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు శ్రీధర్, హుస్సేన్, నరసింహ గౌడ్, నర్సాపూర్ ఏరియా సిపిఎం కార్యదర్శి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ నిలిపివేతకు పార్టీలకతీతంగా పోరాటం

డంపింగ్ యార్డ్‌కు బీఆర్ఎస్ అనుమతి ఇచ్చిందనడం అవాస్తవం

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

పార్టీలకతీతంగా డంపింగ్ యార్డ్‌ను నిలిపి వేసేందుకు పోరాడదామని ఎమ్మెల్యే మాజీ మంత్రి సునీత రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీత లక్ష్మారెడ్డి మాట్లాడారు. ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ అభివృద్ధి నిరోధకులుగా మారకూడదని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. అదేవిధంగా నర్సాపూర్ పట్టణానికి మంజూరైన టూరిజ మోటర్, అర్బన్ పార్క్, పలు అభివృద్ధి పనులు నిలిపి వేయకుండా అందరం కలిసికట్టుగా ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కోరారు. నర్సాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్‌కు బిఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందనడంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అంతకుముందు 2008, 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ ప్రాంతానికి డంపియార్డ్‌కు స్థలాన్ని కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఈ డంపు యార్డ్ నర్సాపూర్ నియోజకవర్గానికి శాపంగా మారుతుందని, పచ్చని అడవిలో చిచ్చు పెట్టినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం రాజకీయాలకతీతంగా పార్టీలన్నీ ఏకమై డంపింగ్ యార్డ్‌ను నిలిపివేసేంతవరకు ప్రజలు, .విద్యార్థులు, యువతీ, యువకులు అందరూ కలిసికట్టుగా పోరాటం సాగించాలన్నారు. అంతేగాక అన్ని రాజకీయ పార్టీలు జేఏసీ (జాక్) ఏర్పాటు చేసి, డంపింగ్ యార్డ్ రద్దు కోసం ఉద్యమించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నర్సాపూర్ నియోజకవర్గానికి, నర్సాపూర్ మున్సిపాలిటీకి వచ్చిన అభివృద్ధి నిధులను నిలిపి వేసిందని ఆమె మండిపడ్డారు. ఇప్పటికైనా విమర్శలు మాని పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలన్నారు. డంపు యార్డును రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రులను కలసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. డంపు యార్డుతో వన్యప్రాణులకు నష్టం కలగడమే కాకుండా, త్రాగునీరు, గాలి కలుషితమై ప్రజలకు ఈ డంపింగ్ యార్డ్ పెనుముప్పుగా మారనుందన్నారు. మన అడవిని అందరం కలిసి కాపాడుకుందామని, డంపింగ్ యార్డ్ రద్దయ్యే వరకు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నయీముద్దీన్, సత్యం గౌడ్, నడిపి లావణ్య రవి, జితేందర్ రెడ్డి, మానయ్య శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంచుకోవడం ఐచ్చికం కాదు..అవసరం

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

ప్రొఫెసర్ సిబా ఉద్గాట



నవతెలంగాణ-పటాన్ చెరు

జ్ఞానం నిరంతరం అభివృద్ధి చెందుతోందని, ఈ పరిణామ వేగం ఏండ్లు నుంచి కేవలం రోజులకు చేరుకుందని, అందువల్ల మనని మనం ధువీకరించుకోవడం ఇకపై ఐచ్చికం కాదు, అవసరం అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సిబా ఉద్గాట స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, హైదరాబాదులోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పెద్ద భాషా నమూనాలు ఉత్పాదక కృత్రిమ మేధస్సు అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించిన డాక్టర్ ఉద్గాట మాట్లాడుతూ..కృత్రిమ మేధస్సు, సాంకేతికతలో వేగవంతమైన పురోగతి గురించి తెలుసుకోవాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మౌలిక అంశాలపై పట్టు సాధించడం తప్పనిసరి అయినప్పటికీ, పురోగతికి నిరంతర అభ్యాసం, విచారించే తత్త్వం అవసరమన్నారు. ఆవిష్కరణలకు కీలకం ప్రశ్నించడంలో ఉంది. ఏదైనా ఎందుకు పనిచేస్తుందో, ప్రత్యామ్నాయాలు ఎందుకు ఉన్నాయో అర్థం చేసుకోవడం అవశ్యమని వ్యాఖ్యానించారు. ప్రారంభోత్సవంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ మౌనేంద్ర శంకర్ దేశర్కర్ మాట్లాడుతూ.. గీతం ఇటువంటి ప్రభావవంతమైన వర్క్ షాపులను నిరంతరం నిర్వహిస్తున్నందుకు ప్రశంసించారు. ఇందులో పాల్గొంటున్న వారు కృత్రిమ మేధస్సుపై జరిగే పరిశోధన, ప్రయోగాలలో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. 'ఇది సంక్లిష్టమైన, అభివృద్ధి చెందుతున్న రంగం. కృత్రిమ మేధస్సు మానవ ఆలోచన ప్రక్రియలను ఎలా అనుకరిస్తుందో అన్వేషించడం ద్వారా గణనీయమైన మెరుగుదల, పురోగతిని సాధించగలం. ఈ భావనలను నిజంగా అర్థం చేసుకోవడానికి ఆచరణాత్మక అనుభవం కీలకం' అని ఆయన పేర్కొన్నారు. కార్యశాల నిర్వాహకులు డాక్టర్ మోతాహర్ రెజా, ప్రొఫెసర్ బీ.ఎం. నాయుడు, గౌరవనీయ అతిథులను సాదరంగా స్వాగతించగా, సమన్వకర్తలు డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, డాక్టర్ కె.కృష్ణ వందన సమర్పణ చేశారు. ఈ కార్యశాల నిపుణుల నేతృత్వంలో చర్చలు, ఆచరణాత్మక సెషన్ లు, సహకార అభ్యాసాలతో శుక్రవారం వరకు కొనసాగనుంది.

కార్మికుల శ్రమను దోచుకుంటున్న ఎంఆర్ఎఫ్ యజమాన్యం

- 4 సంవత్సరాలుగా పని చేస్తున్నా పర్మనెంట్ కాదాయే
- కార్మికుల పట్ల యాజమాన్యం మొండి వైఖరి నశించాలి
- పరిశ్రమ గేటు ముందు ఉదయం నుంచి కార్మికుల ఆందోళన
- ఆందోళనకు మద్దతు పలికిన సీఐటీయూ నాయకత్వం





నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పారిశ్రామిక ప్రాంతంలో అంకెనపల్లి వద్ద ఉన్న ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు గురువారం ఉదయం పరిశ్రమ ఎదుట బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని, నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి సీఐటీయూ తన సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను తీసుకునేటప్పుడు 3 సంవత్సరాల తర్వాత పర్మనెంట్ చేస్తానని చెప్పిన యాజమాన్యం కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకని శ్రమ దోపిడికి పాల్పడుతుందని ఆరోపించారు. నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని ఇంతవరకు పర్మినెంట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. దాదాపు 350 మంది కార్మికులు శ్రమదోపికి గురవుతున్నారన్నారు. కార్మికులకు కనీసం కనీస వేతనం కూడా అమలు చేయకుండా, తక్కువ జీతాలు ఇస్తుందన్నారు. ఎంఆర్ఎఫ్ యాజమాన్యంపై కార్మిక శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎవరైనా కార్మికులు ఏదైనా సమస్య గురించి అడిగితే, మరుసటి రోజే గేటు వద్ద నిలిపివేస్తున్నారని, వారిని విధుల నుంచి తొలగిస్తున్నారన్నారు. కార్మికుల శ్రమతోనే యజమాన్యం లాభాలను ఆర్జిస్తుందన్నారు. కార్మికులకు సరైన సౌకర్యాలు, చట్టపరమైన హక్కులు అందడం లేదన్నారు. ఆందోళనలో పాల్గొన్న కార్మికులెవరిని కూడా డ్యూటీ చేయకుండా ఆపకూడదన్నారు యధావిధిగా డ్యూటీకి వచ్చేటట్లు చేయాలని ఆయన కోరారు. యజమాన్యం కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యలను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి సిఐటి సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, రాబోయే కాలంలో వారి సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఐఐటి జేఈఈ మెయిన్స్‌లో ఇష్టా విద్యార్థుల విజయకేతనం

నిష్ణాతులైన అధ్యాపకుల బోధనతో విద్యార్థుల లక్ష్యసాధన

ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్ కోట





నవతెలంగాణ-పటాన్‌చెరు

ఐఐటీ జేఈఈ మెయిన్స్ పరీక్షలలో ఐఐటి లక్ష్యం, ఆశయ సాధనలో ఇష్టా విద్యార్థులు ఒత్తిడి లేని అధ్యయనంతో మంచి ఫలితాలు సాధించారు నిపుణులైన అధ్యాపకుల బోధన, విద్యార్థుల కృషి లక్ష్యసాధన మార్గాన్ని సఫలీకృతం చేసింది. ఐఐటి జేఈఈ మెయిన్స్‌లో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ ఫలితాలలో ఇష్టా విద్య సంస్థలు మేటిగా నిలుస్తూ ప్రత్యేకతను చాటుకుంది. పటాన్‌చెరు పటేల్ గూడ, సంగారెడ్డిలోని ఇష్టా విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు. ఈ సందర్భంగా పటేల్ గూడ బ్రాంచ్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో 99.17% సాధించిన పి కార్తీక్‌ను ఇష్టా విద్య సంస్థల చైర్మన్ కార్తీక్ కోట, డైరెక్టర్ వినోద్, ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, అధ్యాపక బృందం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కార్తీక్ కోట మాట్లాడుతూ నిపుణులైన అధ్యాపకుల బోధనతో విద్యార్థుల లక్ష్యసాధన క్రమశిక్షణ పాటించి నిరంతర విజ్ఞానాన్ని సంపూర్ణంగా నేర్చుకుంటూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, భావి నిర్మాణానికి మార్గదర్శకం కావాలని హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఉత్తమ ఫలితాన్ని సాధించిన విద్యార్థి కార్తీక్ మాట్లాడుతూ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ ఇష్టాలో తన ముందు సీనియర్ విద్యార్థుల పట్టుదల, కళాశాలలో బోధిస్తున్న పాఠ్యాంశాలు, ఇస్తున్న శిక్షణ శాస్త్రీయ వాస్తవికత, ప్రశ్నించే తత్వంతో ఒత్తిడి లేని అధ్యయనం, ఆటలు పాటలు, సాంస్కృతిక కళా నైపుణ్యాలు విద్యార్థుల జిజ్ఞాస ఇష్టా విద్యాసంస్థలలో చేరడాన్ని ఆసక్తి చూపించి ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో మంచి ఫలితాన్ని సాధించడానికి మార్గం చూపించిందన్నారు. ఈ సందర్భంగా ఇష్టా విద్య సంస్థల యజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందంతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
2
శుక్రవారం | 14 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.రమేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌లు 42 శాతం ఇవ్వడానికి చట్టబద్ధత కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ స్వాగతిస్తుందని రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.రమేష్ అన్నారు. కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుంచి 28 వరకు మరో అవకాశం ఇచ్చినందున అందరూ వారి సమాచారం ఇవ్వాలని కోరారు. మార్చిలో జరగబోయే అసెంబ్లీ సమావేశంలో 42 శాతం ఇవ్వాలని తీర్మానం పెడతామని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఢిల్లీ తీసుకు వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తామని చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని కోరారు. బీసీలకు విద్యా ఉద్యోగాలలో కల్పించిన విధంగా స్థానిక సంస్థలలో కూడా ఏబీసీడీ వర్గీకరణ చేయాలన్నారు. సర్వే అయిన తర్వాత కులాల వారీగా పూర్తి వివరాలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితి పై సమగ్ర సమాచారం రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

జహీరాబాద్‌లో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

- పార్టీ మిమ్ములను గుర్తిస్తుంది
- మాజీ మంత్రి హరీష్ రావు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మండలంలో పార్టీ కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయి. ఇంకా కార్యకర్తలు అందరూ కలిసి పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో శాసనసభ్యులు కే.మాణిక్యరావుతో పాటు జహీరాబాద్ పార్టీ మండల అధ్యక్షులు తట్టు నారాయణ యాదవ్‌తో పాటు పలువురు కార్యకర్తలు ఆయనను కలశారు. అనంతరం జహీరాబాద్‌లో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టినటువంటి కార్యక్రమాలకు సంబంధించి దిశా నిర్దేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, దత్తు రెడ్డి, పీజీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించిన ప్రత్యేక అధికారి



నవతెలంగాణ-కంది

మండలంలోని ఎర్దనూర్, చేర్యాల, కసిపూర్, కలివేముల తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను, కమ్యూనిటీ ప్లాంటేషన్లను, హార్టికల్చర్ ప్లాంటేషన్‌లను స్పెషల్ కమిషన్ (ఆర్ డి) పాజియుల్లా, నరసింహారావు(సి ఆర్ డి) గురువారం పరిశీలించినారు. ఎండకాలన్నీ దృష్టిలో ఉంచుకుని అన్ని నర్సరీలో నీళ్ళు తప్పక ఉండేలా చూడాలని, షేర్ నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో వన మహోత్సవ కార్యక్రమంలో పెట్టిన చెట్లకు నీరు పోయాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ బాల్ రాజ్, ఎంపీడీఓ, ఏపీఓ పాల్గొన్నారు.

మతం పేరుతో ఇతరులపై దాడి చేయడం సరికాదు

- రంగరాజన్ పైన చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- నిందితులను వెంటనే శిక్షించాలి
- సీపీఐ(ఎం) నాయకులు రమేష్ గౌడ్



నవతెలంగాణ-మునిపల్లి

చిలుకూరి బాలాజీ ఆలయ పూజారిరంగరాజన్‌పై రామసేన పేరుతో దాడి చేసిన వారిని శిక్షించాలని, దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) నాయకులు రమేష్ గౌడ్ అన్నారు. మండలం బుదేరా చౌరస్తాలో ఎల్లలింగ ఆశ్రమంలో సీపీఐ(ఎం) పార్టీ శాఖ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మతం పేరుతో చర్యలకు పాల్పడిన వారిని శిక్షించాలని, రంగరాజన్ లౌకికవాదిగా ప్రజాస్వామ్యవాదిగా దేవుడు అందరికీ సమానం అనే భావనతో కులమతాలతో సంబంధం లేకుండా అందరికీ ఆలయ ప్రవేశం కల్పించి, సమానత్వంను చాటి భారత రాజ్యాంగాన్ని దాని విలువలను గౌరవిస్తూ అక్కడికి వచ్చే భక్తులకు చైతన్య పరుస్తూ కార్యక్రమాలు చేయడాన్ని రామసేన సైన్యం పేరుతో ఏర్పడ్డ సమస్త అది జీర్ణించుకోలేక పోయింది. అక్కడికి వచ్చే భక్తులను రామసేనలో చేర్పించాలని రంగరాజన్‌పై ఒత్తిడి చేయడంతో దానికి రంగరాజన్ ఒప్పు కోకపోవడంతో వారు రంగరాజన్‌పై ఈ దాడికి పాల్పడ్డట్టు చెప్పడం దుర్మార్గమన్నారు. రాముని పేరుతో ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతూ సమభావనంతో ఉన్న ప్రజలను విచ్ఛిన్నం చేయడం కోసం పనిచేస్తున్న ఇలాంటి సంస్థలపై వెంటనే చర్య తీసుకోవాలన్నారు. భక్తి పేరుతో చేస్తున్న ఈ దుర్మార్గాన్ని వెంటనే అరికట్టాలని ఈ దాడికి పాల్పడిన వారందరిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు మునుముందు జరగకుండా ప్రభుత్వం ఇలాంటి సంస్థలపై నిఘ పెట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేష్, నర్సింలు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో తనిఖీ చేసిన ఎంపీడీఓ

నవతెలంగాణ-చౌటకూర్

మండలంలోని శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఎంపీడీఓ రామలింగం తనిఖీ చేశారు.ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నదని విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌లు నిర్వహించి 100శాతం ఉతీర్ణత వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిదంగా విద్యార్థులకు వడ్డించే అహారాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి పోసాని పల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల గురించి వివిధ పార్టీలకు చెందిన మండల అధ్యక్షులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-రాయికోడ్

బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్, డైరీని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆవిష్కరించారు. గురువారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో క్యాలెండర్ ఆవిష్కరించి అనంతరం వివాహ వేడుకలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకుంటున్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విట్టల్, నాయకులు తుకారం, బసవరాజ్, చంద్రశేఖర్, మల్లేశం, శంకర్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

- ఎస్పీ సీహెచ్.రూపేష్

నవతెలంగాణ-జహీరాబాద్

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని జిల్లా ఎస్పీ సీహెచ్ రూపేష్ అన్నారు. గురువారం ఆచార్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక షట్కర్ ఫంక్షన్ హాల్లో ఆచార్య యువతరంగ్ 2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత ఈ దేశానికి వెన్నుముక సన్మార్గంలో ప్రయాణం చేస్తే మీరు ఎంచుకున్న లక్ష్యానికి చేరుకుంటారన్నారు. నేడు వివిధ రంగాల్లో రాణిస్తున్నటువంటి వారంతా గ్రామీణ ప్రాంతాలకు చెందినటువంటి యువతి యువకులేనని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు చదువుకోవాలని విజ్ఞప్తి చేశారు. యువత రోడ్ సేఫ్టీ రూల్స్ పాటించాలని సైబర్ క్రైమ్ అరికట్టేల చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు తమ గ్రామాల్లో తమ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మత్తుపదార్థాలను సేవిస్తే వారి వివరాలను పోలీస్ స్టేషన్లకు కానీ 100 నెంబర్కు, ఫోన్ చేసి తెలిపారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువు తోడ్పాటు అని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు నందు గౌడ్, నర్సింలు, దత్తు ,రమేష్, లావణ్య ,నిఖిత, ఇర్షద్ సుల్తానా, సల్మా, ఉనిసా కీర్తి నవీన, శిరీష ,శ్వేత, దీపిక ,సురేష్, ప్రియాంక , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



అనాధలైన అక్క చెల్లెల్లను పరామర్శించిన ఐసీడీఎస్ అధికారులు



నవతెలంగాణ-వట్‌పల్లి

పేదరికంతో అనారోగ్యం బారినపడి బూదెమ్మ ఈనెల 6న మృతి చెందిన సంఘటనతో భాగ్య భార్గవిల అక్కచెల్లెలు అనాధలుగా మిగులటంతో వివిధ పత్రికల్లో అనాధలైన అక్క చెల్లెల దీనస్థితిని వెలుగులోనికి రావడంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించడంతో జిల్లా ఆ శాఖ అధికారులు గురువారం అక్కచెల్లెళ్ల కుటుంబాన్ని పరామర్శించారు. భాగ్య బర్గవిలను వాత్సల్య పథకము ద్వారా ఆదుకునేందుకు నెలకు రూ.4వేలు అందజేస్తామన్నారు. అదేవిధంగా బాలసదనములో ఆశ్రయం కల్పించి వారికి విద్యను కూడా అందులోనే అందించడం జరుగుతుందన్నారు. దురదృష్టకరంతో బూదమ్మకు శవ యాత్ర నిర్వహించేందుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ను వినియోగించకుండా కుటిల ప్రయత్నాలు పన్నినప్పటికీ చివరికి ట్రాక్టర్ డ్రైవర్ రాకపోయినప్పటికీ తమె ట్రాక్టర్లు తోలుతూ మృతదేహాన్ని సమాధి కార్యక్రమాన్ని పూర్తిచేసేందుకు తరలించవలసిందని ఆ గ్రామానికి చెందిన కొందరు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ట్రాక్టర్ నిరాకరణ పై జిల్లా కలెక్టర్కు. డిపిఓకు ఫిర్యాదు చేయనున్నట్లు సన్నిహితుల ద్వారా తెలిసింది ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు రత్నం విట్టల్ యాదగిరి ప్రియాంక సి డి పి ఓ పాల్గొన్నారు

వివాహ వేడుకలో నాగేష్ శెట్కార్



నవతెలంగాణ-మనూర్

మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన రాములు కూతురు వివాహము గురువారం జరిగింది. ఆ వివాహ వేడుకలో మాజీ జిల్లా ప్రణాళిక సభ్యులు నాగేష్ శెట్కార్ పాల్గొని వధు వరులను ఆశీర్వదించి, కుటంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు పీసీసీ సభ్యులు కె.శ్రీనివాస్ నాయకులు నారాయణ రెడ్డి బసగొండ, తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్

కులగణన చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం సకల జనుల సర్వే జరిపితే బీసీల జనాభా 51శాతం రాగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన కులగణన సర్వేలో 46.25శాతం వచ్చిందంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల జనాభాను తగ్గించి బీసీలను మనోవేదనకు గురిచేసిందని ఆరోపించారు. ఈ సర్వే మొత్తం తప్పుల తడక అని బీఆర్ఎస్‌తో సహా బీసీ సంఘాలన్నీ చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పుడు ఈ సర్వేను తిరిగి రిసర్వే చేస్తామని ప్రభుత్వం చెప్పడం చూస్తుంటే కులగణన సర్వే మొత్తం తప్పుగా జరిగినట్లు ఒప్పుకోవడమే, ఇప్పటికైనా కులగణన సరైన రీతిలో చేయాలని, ఈ సర్వేను తొందరగా జరిపి బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి త్వరలో ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మాజీ ఎంపీటీసీ శికారి శ్రీనివాస్, నాయకులు జి.నర్సింలు, శివకుమార్, మలశెట్టి, యస్.శ్రీనివాస్, బి.విఠల్, తదితరులున్నారు.



పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



నవతెలంగాణ-సంగారెడ్డి: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి.రమేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయ మూర్తి బి.రమేష్ గురువారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఓఎస్‌హెచ్ చట్టం 2013 పని ప్రదేశాల్లో స్త్రీలపై లైంగిక వేధింపులు జరపరాదని, జరిపిన వారు కఠినంగా శిక్షించబడతారని తెలిపారు. మహిళా ఉద్యోగులు కార్మికులు ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు ఇవ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్ రావు, అటవీ శాఖ ఉద్యోగులు, ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ ఏర్పాటుకు మార్కెట్ సెట్టర్ పరిశీలన



నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంలో గ్రంథాలయ ఏర్పాటుకు వ్యవసాయ మార్కెట్ సెట్టర్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్ జోషితో కలిసి సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మెన్ అంజయ్య గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మార్కెట్ కార్యాలయంలోని చాంబర్లో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికి 20 గ్రంథాలయాల కార్యాలయాలు ఉన్నాయని మరికొన్నిటిని జిల్లాలో అక్కడక్కడ అవసరమున్న చోట గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అవసరం ఉన్నట్లయితే అద్దె లేకుండా గదిని ఇచ్చేందుకు ఎవరైనా సుముఖంగా ఉంటే అక్కడ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మెంటనెన్స్ కింద వెయ్యి రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పెద్ద గ్రామాలు ఉన్నచోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలంటే సంబంధిత ప్రధానోపాధ్యాయులు తీర్మాన పత్రాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం మండల కాంగ్రెస్ అధ్యక్షులు శేషారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బాలకిషన్, ఉమ్మడి రేగోడు మండలం మాజీ జెడ్పీటీసి రాంరెడ్డి, ఉమ్మడి రేగోడు మండల మాజీ ఎంపీపీ పత్రి విట్టల్, లైన్స్ క్లబ్ కోఆర్డినేటర్ పెద్దన్న కచ్చుర్ రావు, శంకరప్ప, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వయం పాలన దినోత్సవం



నవతెలంగాణ-మునిపల్లి : మండలంలోని కంకోల్ జడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా చేసుకున్నారు. డిఈఓగా తబ్రేజ్ అద్నాన్, ఎంఈఓగా షహద్ బిలాల్, ప్రధానోపాధ్యాయులు గా సబిలా, ఉపాధ్యాయులుగా అదిబా, సాదియా, అల్ఫిషా, ఆఫ్షన్, సానియా, జినత్, మాదిహా, సదాబేగామ్, పీఈటీగా తాబ్ రేహ్, ఓఎస్ గా రూబీనా వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమేష్, రాములు, రాఫత్, జమీలా, ఫిరోజ్ యాస్మిన్, నసీంబేగం, ఎక్రా నౌరీమ్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై పార్టీలతో సమావేశం



నవతెలంగాణ-న్యాల్ కల్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా జిల్లా అధికారుల ఆదేశాలతో మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 99 పోలింగ్ బూత్‌ల్లో అభ్యంతరాల స్వీకరణ తెలపాలని ఎంపీడీవో రాజశేఖర్ రాజకీయ పార్టీలకు వివరించారు. బీజేపీ పార్టీ మినహా అధికార విపక్ష పార్టీల సమావేశానికి అనాసక్తి చూపారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలో నియమ నిబంధనలపై హాజరైన బీజేపీ నాయకులకు మార్గదర్శకం చేశారు ఎంపీడీవో రాజశేఖర్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్, ఓంకార్ , బసవరాజ్ , నవీన్ , రాజు , విష్ణు, తదితరులున్నారు

అందోలులో వాషింగ్టన్ సుందర్ సినిమా షూటింగ్



నవతెలంగాణ-జోగిపేట

అందోలు మండల, జోగిపేట పరిసర ప్రాంతాల్లో ఎస్ఎస్ మూవీ కార్పొరేషన్ బ్యానర్‌లో సత్య వినుకొండ, అనుశ్రీ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం "వాషింగ్టన్ సుందర్ " వెరైటీ యాక్షన్, లవ్ ఎంటర్టైనర్ సినిమాను గురువారం డాకూర్ వద్ద షూటింగ్ నిర్వహించారు. గత కొన్ని రోజులుగా జోగిపేట దాని పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలి పింది. ఈ చిత్రంలో చాలామంది జోగిపేట పరిసర ప్రాంత నటులు కూడా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ ,స్క్రీన్ ప్లే, నిర్మాత, దర్శకత్వం సత్య వినుకొండ, ఈ చిత్రం డీఓపీ డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ మధు బసిరెడ్డి ఈ చిత్రానికి సంగీతం బొబ్బిలి నందన్ రాజ్, సురేష్ బొబ్బిలి, ఎడిటింగ్ శ్రీ మేనగ, ఈ చిత్రానికి కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్, తదితరులు వ్యవహరిస్తున్నారు. ఈ మూవీలో జోగిపేట కళా సమితి సభ్యులే కాకుండా జోగిపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆసక్తి గల కళాకారులకు ఈ సినిమాలో అవకాశం కల్పించడం జరుగుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ చిత్రానికి జోగిపేట కళా సమితి సభ్యుడు సుగ్నేష్ చారి అసిస్టెంట్ డైరెక్టర్, పని చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

- మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి



నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గాంధీనగర్‌లోని న్యూ బేతెస్థ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి వద్ద మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఏటా ఆసుపత్రి యజమాన్యం ఉచితంగా క్యాంపులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరంలో రోగులకు ఆసుపత్రి సిబ్బంది కార్పొరేట్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కౌన్సిలర్ చంద్రారెడ్డి తో పాటు ఆసుపత్రి బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ చంద్రయ్య, పాస్టర్లు శంకర్, జోబాబు, అబ్రహం, స్థానిక నాయకులు దేవదాస్, నర్సింహా, రాజు, కుమార్, విశ్వ, మోజేష్, రోగులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
శుక్రవారం | 14 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

తాగునీరు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-మెదక్

మెదక్ ఆర్‌డీఓ కార్యాలయంలో వాహనదారులకు కనీస వసతులు కల్పించాలని మెదక్ పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..వాహనదారులకు కనీస వసతులు లేకుండా త్రాగడానికి మంచినీరు కూడా ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వానికి వాహనాల రిజిస్ట్రేషన్ ల కోసం డ్రైవింగ్ లైసెన్స్ ల కోసం వేల రూపాయలు ప్రభుత్వం టాక్స్‌ల రూపంలో చెల్లిస్తే రోజుకు లక్షల రూపాయలు చెల్లిస్తున్న వాహనదారులకు కనీస వసతులు కల్పించకుండా ఎండలో కూర్చోబెట్టడం సరికాదన్నారు. తీవ్రమైన ఎండలు మండిపోతున్నందున తక్షణమే ఆర్టీవో వాహనదారులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. విషయాన్ని త్వరలోనే జిల్లా కలెక్టర్ బీఆర్ఎస్ పార్టీ తరపున ఫిర్యాదు చేస్తాం అని తెలిపారు.

ఎన్నికల విధుల్లో సీనియారిటీని పరిగనించాలి

- ఎంపీడీఓకు టీఎస్ యూటీఎఫ్ విన్నపం



నవతెలంగాణ-శివ్వంపేట :

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో స్టేజ్-2 అధికారులను నియమించడంలో ప్రభుత్వం సీనియారిటీ ప్రాతిపదికన చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌కు, ఎంఆర్సీ కార్యాలయంలో మండల విద్యాధికారి బుచ్చ నాయక్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో దీర్ఘకాలికంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులు, గర్భిణీలు, చిన్న పిల్లలున్న ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు డాక్టర్ చక్రుసింగ్, ప్రధానకార్యదర్శి కనకరాజు, ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్ సంతోష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక డంపుల సీజ్



నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని ఎంకేపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు పాపన్నపేట ఏఎస్సై సంగన్న వెల్లడించారు. ఇందులో సుమారు 14 ట్రాక్టర్ల ఇసుక ఉంటుందని ఆయన వెల్లడించారు.

ఏడుపాయల హుండీ లెక్కింపు

- ఆదాయం రూ.47 లక్షల 33 వేలు



నవతెలంగాణ-పాపన్నపేట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానం హుండీ ఆదాయం రూ.4733787లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్, సహాయ కమిషనర్ అంజలీదేవి తెలిపారు. శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. 52 రోజులకు గాను హుండీ ఆ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆలయ సిబ్బంది, పాపన్నపేట పోలీస్ సిబ్బంది సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-శివ్వంపేట

మెదక్ జిల్లా శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో ఈనెల 17న సోమవారం శక్తిపీఠం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరుగుతుందని బగలాముఖీ ట్రస్టు చైర్మెన్ శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, ట్రస్టు సభ్యులు జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, శాస్త్రుల పురుషోత్తం శర్మ, పబ్బ మహేష్ గుప్త, దర్శనం వెంకటరమణ శర్మ, పత్రాల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యుల సహకారంతో 17న ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనము,ప్రధాన దేవతా మండపస్థాపన, 9 గంటలకు అగ్నిప్రతిష్ఠ, బగలాముఖీ మహామంత్ర హావనములు,మహాభిషేకములు, గంగ, గోదావర్యాధి పుణ్యతీర్థములతో కూడిన అష్టోత్తర శత (108) కలశ స్థాపన,తదితర కార్యక్రమాలు జరుగుతాయని వెంకటేశ్వర శర్మ తెలిపారు. భక్త జనులందరు కూడ అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి దీవెనలను అందుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటి పత్రాలు పొగట్టుకున్న వ్యక్తి

నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని బోర్గి గ్రామానికి చెందిన భుతలే అంబిక భర్త సోపాన్‌లకు సభందించిన ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకుని గత 15 రోజుల క్రితం బైక్‌పై కంగ్టికి వస్తుండగా దారిలో పడిపోయినయని గురువారం నవతెలంగాణ విలేకరితో మోరపెట్టుకున్నారు. తన ఇంటికి సంభందించిన పత్రాలు ఎవరికైనా దొరికితే ఈ నంబర్ 9640798711కు ఫోన్ చేయాలనీ కోరారు. ఈ పత్రాలు ఆచూకీ తెలిపిన వారికీ రూ.500లు అందజేస్తానని తెలిపారు.

రఘువీరారెడ్డి సేవలు ఎంతో గొప్పవి

- బీజేపీ మండల అధ్యక్షులు రవి



నవతెలంగాణ-శివ్వంపేట :

ఎంతో మంది పేదింటి ఆడపిల్లల పెండ్లిలకు తన స్వంతంగా డబ్బులతో పుస్తె మట్టెలను అందించి, ఆడపిల్లల తల్లిదండ్రులకు కొంత బాసటగా నిలుస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రఘువీరారెడ్డి సేవలు ఎంతో గొప్పవని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి అన్నారు. మండలంలోని చిన్నగొట్టిముక్కుల గ్రామానికి చెందిన పట్నం నర్సిములు, లక్ష్మీ దంపతుల కూతురు దీపిక వివాహానికి తన స్వంతంగా రఘువీరారెడ్డి బహుకరించిన పుస్తెమెట్టెలను గురువారం బీజేపీ మండల అధ్యక్షులు పెద్దపులి రవి, చిన్నగొట్టిముక్కుల బీజేపీ బూత్ అధ్యక్షులు భూంరావు, రమేష్‌లు వధువు కుటుంబసభ్యులకు అందజేశారు. రఘువీరారెడ్డికి మండల ప్రజల తరుపున, మండల పార్టీ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వావసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణానికి చెందిన యువ సిద్ధాంతి సోమయాజుల సాయిరాంశర్మ ఆధ్వర్యంలో రూపొందించిన విశ్వాస నామ సంవత్సర పంచాంగాన్ని నాచారం గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆవిష్కరించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీపార్నంది విశ్వనాథ శర్మ గురువారం సంప్రదాయ బద్ధంగా పంచాంగాన్ని ఆవిష్కరించారు. శ్రీ లలితా సేవాసమితి వ్యవస్థాపకులు దేవి ఉపాసకులు బ్రహ్మశ్రీ సోమయాజుల రవీంద్ర శర్మ ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు.



ఎన్నికల్లో స్టేజ్ -2 అధికారుల పాత్ర కీలకం



- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో స్టేజ్ -02 అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి స్టేజ్-02 రిటర్నింగ్ ఆఫీసర్స్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్టేజ్ -02 అధికారులు కీలకంగా వ్యవహరించాలని, ఈయనే కౌంటింగ్ చేసి ఫలితాలు ప్రకటించే అధికారిగా ఉంటారన్నారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజు నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించుకోవాలని, పోలింగ్ కేంద్రాలను పరిశీలించుకుని మౌలిక వసతులు సరిగా ఉన్నాయా లేదా లేకపోతే సంబంధిత ఎంపీడీవో దృష్టికి తీసుకుని వెళ్లి తద్వారా చర్యలు చేపట్టాలన్నారు. రెండో రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లతో విధులు నిర్వహించే వారితో వెళ్లి పోలింగ్ కేంద్రాల్లో ఉండి మరుసటి రోజు ఎన్నికల నిర్వహించుకుని వార్డ్ వైజ్ , కౌంటింగ్, సర్పంచ్ కౌంటింగ్ చేసి ఉపసర్పంచిని ఎన్నిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ వార్డ్ మెంబర్స్, సర్పంచ్ ఎంపికలో ఎలాంటి పొరపాట్లు తావు లేకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి,జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, విద్యాశాఖ అధికారి రాధా కిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, సంబంధిత స్టేజ్-02అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కారవంతమైన చదువు భవిష్యత్తుకు పునాది

- చేతి రాత నిపుణులు అజాజ్ అహ్మద్

నవతెలంగాణ-టేక్మాల్

సంస్కారవంతమైన చదువు భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని ప్రముఖ చేతి రాత నిపుణులు అజాజ్ అహ్మద్ అన్నారు. కుసంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ లలో అద్భుతమైన చేతి రాత అభివృద్ధిపై ప్రముఖ చేతి రాత నిపుణులు అజాజ్ అహ్మద్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల రాతను మార్చటం కష్టం కావచ్చు కానీ చేతి రాత అందంగా మార్చుకోవడం సులభమన్నారు. అంతేగాక అందమైన చేతి రాత ద్వారా మనలోని ప్రతిభను మెరుగుపరుచుకో వచ్చన్నారు. తద్వారా మన భవిష్యత్తును అందంగా మార్చుకోవచ్చని ఈ సందర్భంగా ఆయన సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ చేతి రాత అవగాహనా సదస్సును నిర్వహించడం జరిగింది. ఉపాధ్యాయులు, మల్లేశ్వరి, శంకర్, రమేష్, మురళి, సుభాష్, సి.ఆర్.పి. మొగులయ్య మల్లేశం పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో సమావేశమైన ఏపీవో

నవతెలంగాణ-వట్‌పల్లి: ఉమ్మడి అల్లాదుర్గం మండలంలోని బైరన్‌దిబ్బ గ్రామంలో ఏపీవో సుధాకర్ ఉపాధి కూలీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధి పనులు చేపట్టేందుకు కూలీలు ఉదయం పూట వెళ్లి కొలతల ప్రకారము తమ పనులు చేసుకోవాలన్నారు. పని నిమిత్తం జాబ్ కార్డు లేని వ్యక్తులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి జాబ్ కార్డుకు అప్లై చేసుకోవాలన్నారు. పనులు చేసుకోవాలని తపన ఉన్నవారికి తప్పకుండా జాబ్ కార్డు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు,పాల్గొన్నారు



గ్రామపంచాయతీ కార్మికులమా..? ఉపాధి హామీ కూలీలమా..?

- గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్.

నవతెలంగాణ-మనోహరాబాద్.

గ్రామపంచాయతీ కార్మికుల చేత కార్యదర్శులు ఉపాధి హామీ కూలీలు చేసే పనులను పంచాయతీ కార్మికుల చేత చేయిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పేర్కొన్నారు. గురువారం మనోహరాబాద్ మండల ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బంది తోటి ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు చెత్త సేకరణ చేస్తున్నారు. 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉపాధి పనులు చేయిస్తున్నారని ప్రతి గ్రామ పంచాయతీకి ఉపాధి పనులకు రెండు నుంచి నాలుగు ట్యాంకర్ల వరకు చెట్లకు నీళ్లు పోయిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో చేసే పనులకు కార్యదర్శులు బిల్లులు పెట్టుకునే అవకాశం ఉంటుందని కానీ గ్రామపంచాయతీ కార్మికులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి చేత కూలీలు చేయాల్సిన పనిని చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. ఉపాధి హామీ వర్కర్లు చేసే పని గ్రామపంచాయతీ కార్మికులు చేయాలని పంచాయతీ కార్యదర్శులు వేధిస్తున్నారన్నారు. మేము గ్రామపంచాయతీ కార్మికులమా లేక ఉపాధి హామీ కూలీలమా అని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీకాంత్, ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు.



ఎలకుర్తి పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



నవతెలంగాణ-టేక్మాల్

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ పాఠశాలలో పండుగ వాతావరణం నెలకుంది. టేక్మాల్ మండలంలోని ఎలకుర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌గా స్రవంతి, జిల్లా విద్యాధికారిగా లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సునీత, మండల విద్యాధికారిగా అనూష, టీచర్లుగా ముస్తఫా, దివ్య, జాహ్నవి, సంగీత, వంశీ భాస్కర్, దినకర్, మహాలక్ష్మిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, శ్యామ్సన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శేఖర్, సిద్ధార్థ్ శంకర్, పీడి శ్రీవిద్య పర్యవేక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందించి విద్యార్థులు కష్టపడి చదివి 10వ తరగతిలో మంచి ప్రతిభ కనబరిచి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

నీతి, యోగ్యత లేని వారితో ఫలితం శూన్యం..!

- తూప్రాన్ మున్సిపల్ తాజా మాజీ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్

నవతెలంగాణ-తూప్రాన్

నీతి, యోగ్యత లేని వారితో ఫలితం శూన్యమని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మనిషికి ఉండాల్సిన కనీస జ్ఞానం లేని కారణంగానే చైర్మన్ పదవిని కోల్పోయి అవినీతి మున్సిపల్ మాజీ చైర్మెన్ రవీందర్ నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతూ చివరికి సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. తూప్రాన్ మున్సిపాలిటీ రాబోయే భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందిచడానికి కృషి చేస్తామని అటు నాయకుల, ఇటు కార్యకర్తల విశ్వాసాన్ని కోల్పోయిన వ్యక్తులు పిచ్చి కూతలు కూస్తే ప్రజలు ఎవరు హర్షించరని తెలిపారు. ఏ స్థాయి వారు ఆ స్థాయి మాటలే మాట్లాడతారని,వాళ్ల మాటల ద్వారా వాళ్ళ బుద్ది బయటపడిందని అభిప్రాయపడ్డారు. నీతి,యోగ్యతలు లేని వారితో అందరికీ ప్రమాదమే అని గుర్తు చేశారు.



గిరిజనులకు ఇచ్చిన హామీ ఏమైంది..?

నవతెలంగాణ-శివ్వంపేట

"అంగట్లోనా అన్ని ఉన్న అల్లుని నోట్లో శని ఉన్నదన్నట్లుగా" తయారైంది గిరిజనులకు అధికారులిచ్చిన హామీల మాటలు. ఇక విషయానికొస్తే గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శివ్వంపేట మండలంలో బంజారా, గిరిజన వాసులంతా ఎంతో భక్తి శ్రద్ధలతో ఆనందమయంగా చేసుకోవడం ఒక ఆనవాయితీగా వస్తోంది. గిరిజన తండాల్లో సేవాలాల్ జయంతిని అక్కడ చేసుకొని, 27 తాండల నుంచి యువకులు, నాయకులు సేవాలాల్ మహారాజ్ జెండాలను చేత బట్టుకుని బైక్ ర్యాలీగా మండల కేంద్రమైన శివ్వంపేటకు చేరుకుంటారు. ఇక్కడ మండల గిరిజన నాయకులంతా కలిసి పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను బ్రహ్మాండంగా నిర్వహించి, సంబరాలు నిర్వహిస్తుంటారు. అనంతరం నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణానికి డీజే పాటలతో భారీ బైక్ ర్యాలీతో బయలుదేరి వెళ్లి అక్కడ జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలలో పాల్గొని సంబరాల్లో పాల్గొంటారు. ఇంతటి బ్రహ్మాండంగా నిర్వహించబడుతున్న సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను రోడ్లపై నిర్వహించుకుంటున్నామని, మేము మరింత ఘనంగా చేసుకోవాలంటే మండల కేంద్రమైన శివ్వంపేటలో అధికారులు, నాయకులు ఏదైనా ప్రభుత్వ స్థలం అప్పగిస్తే అందులో సేవాలాల్ మహారాజ్ దేవాలయం నిర్మించి,అక్కడ ప్రతి ఏటా సేవాలాల్ జయంతిని నిర్వహించుకుంటామని, అందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని గిరిజన నాయకులు వేడుకున్నారు.

- స్థలం అప్పగింతకు ఆర్డర్ ఇచ్చుడు..క్యాన్సల్ చేసుడు..

గిరిజన నాయకులు గతేడాది ఇదే ఫిబ్రవరి నెలలో స్థానిక ప్రజా ప్రతినిధులు, తహసీల్దార్‌తో విన్నవించుకోగ అందుకు సమ్మతించిన అధికారులు స్థలం అప్పగింతకు ఒక ఆర్డర్ కాపీని కూడ అందించి, పదైదు నిముషాలలోనే ఇచ్చిన ఆర్డర్ ను క్యాన్సల్ చేశారని ఆరోపిస్తూ ఆగ్రహంతో గిరిజన నాయకులంతా పార్టీలకు అతీతంగా నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రహదారిపై బైటాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. విషయం క్లిష్టంగా మారడంతో హుటాహుటిన శివ్వంపేటకు చేరుకున్న అప్పటి ఎమ్మెల్యే మదన్ రెడ్డి, నాటి మహిళా కమిషన్ చైర్ పర్సన్ హోదాలో ప్రస్తుత ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గిరిజనులతో చర్చించారు. మీకు శివ్వంపేట పరిసరాలలోనే గుడి నిర్మాణానికి స్థలం ఇప్పిస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు.

-ఏడాది కావస్తున్న హామీ అమలు కాలేదు



గతేడాది ఇదే నెలలో సేవాలాల్ జయంతి రోజున అప్పటి ప్రభుత్వ పెద్దలు మాకు గుడి నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం ఇప్పిస్తామని మాట ఇచ్చి సంవత్సరం గడిచిన గానీ హామీ అమలు కాలేదు. ఇది మండల గిరిజనులను మోసం చేయడమే అవుతుంది. కావున ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని భూమి చూపియ్యాలే.

రాంచందర్ నాయక్. నానుతండా

ప్రభుత్వం ఏదైనా సేవాలాల్ గుడికి జాగా ఇవ్వాల్సిందే..



గతంలో గిరిజన నాయకులకు ఇచ్చిన మాటకు కట్టుబడి సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం మండల కేంద్రమైన శివ్వంపేట శివారులో ప్రభుత్వ భూమి కేటాయించాల్సిందే. కార్పొరేట్ సంస్థలు కంపెనీ పెడతామంటే ఆగమేఘాల మీద భూములు చూపించే అధికారులు గిరిజనుల గుడి కోసం ఎందుకు జాగా చుపిస్తలేరు. లేదంటే గిరిజనులమంతా మళ్లీ ఆందోళనలు చేస్తాం.

సూర్యం చౌహాన్. గిరిజన సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షులు.

వ్యవసాయ అధికారితో ముఖాముఖి

నవతెలంగాణ-నిజాంపేట

ప్రజా పాలనలో భాగంగా వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డితో **నవతెలంగాణ** ముఖాముఖి



నవతెలంగాణ: మండలంలో ఇప్పటివరకు రైతు భరోసా డబ్బులను ఎంతమంది రైతులకు పంపిణీ చేశారు.?

వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి: ఇప్పటివరకు రైతు భరోసా డబ్బులను 8886 మంది రైతులకు రూ.4 కోట్ల 16 లక్షల 64వేల 961 లు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగింది.

నవతెలంగాణ: మండలంలో ఎంత మంది రైతులకు రుణమాఫీ అయినది?

వ్యవసాయ అధికారి: మండలంలో ఇప్పటివరకు 4,088 మంది రైతులకు రుణమాఫీ అయినది.

నవతెలంగాణ: డిజిటల్ క్రాఫ్ట్ బుకింగ్ అనగా ఏమిటి..? ఏఏ గ్రామాల్లో జరుగుతున్నది..?

వ్యవసాయ అధికారి: మండలంలోని విస్తరణ అధికారులు గ్రామాలకు వెళ్లి రైతుల పంట పొలాల దగ్గరికి పోయి ఫోటోలు తీసి వెబ్సైట్లో సంక్షిప్తం చేయడాన్ని డిజిటల్ క్రాఫ్ట్ బుకింగ్ అంటారు. ఈ సంవత్సరం నిజాంపేట, కల్వకుంట, నస్కల్, గ్రామాల్లో ఒక్కొక్క ఏఈఓ 2000 ఎకరాలను డిజిటల్ చేయడం జరిగింది. మిగతా గ్రామాల్లో నార్మల్ క్రాఫ్ట్ బుకింగ్ చేయడం జరిగింది.

నవతెలంగాణ: యాసంగి పంటలకు సంబంధించి ఎరువుల లభ్యత తగినంతగా ఉన్నదా..?

వ్యవసాయ అధికారి: యాసంగి పంటలకు సంబంధించి ఎరులను ప్రణాళిక బద్దంగా రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది. ఎరువులకు ఎటువంటి కొరత లేకుండా మార్క్ఫెడ్ సంస్థలో గలవు.

నవతెలంగాణ: ఆయిల్ పామ్ పంట సాగుకు ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు..?

వ్యవసాయ అధికారి: ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వము ప్రత్యేక చొరవ చూపిస్తున్నది. 50 మొక్కలకు వెయ్యి రూపాయలు మాత్రమే రైతులు చెల్లించాలి. మొక్కలకు రాయితీతో పాటు 4 సంవత్సరాల తోట నిర్వహణ అంతర్ పంటల సాగు కొరకు రాయితీ మొత్తంగా రూ.26,450లు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. అలాగే బిందు సేద్యం పరికరాలపై 80 నుంచి 100 శాతం రాయితీ లభిస్తుంది.

సౌరశక్తి విద్యుత్‌కు అద్దె ప్రాతిపదికన భూముల సేకరణ

-అద్దె ప్రాతిపదికన ఎకరాకు రూ.33 వేలు
-భూముల అద్దె నిబంధనలపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంతో పాటు గుగ్గీళ్ళ, వడ్లూర్, బేగంపేట్, దాచారం, తోటపల్లి, రేగులపల్లి, కల్లేపల్లి గ్రామాల శివారుల్లో స్త్రీ శక్తి సౌరశక్తి విద్యుత్ ఏర్పాటుకు రైతుల వద్ద అద్దె ప్రాతిపదికన భూములు సేకరిస్తోందని, ఎకరాకు ఏడాదికి రూ.33 వేలుగా అద్దె నిర్ణయించినట్టు మండల అభివృద్ధి మేనేజర్ దొగ్గల ఉదయ్ కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని అయా గ్రామాల్లో స్త్రీ శక్తి సౌరశక్తి విద్యుత్ ఏర్పాటుకు అద్దె ప్రాతిపదికన భూముల సేకరణపై దొగ్గల ఉదయ్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. 25 ఏళ్లపాటు అద్దె ప్రాతిపదికన భూములందజేసిన రైతులకు వారి కుటుంబంలోని ఉన్నత విద్యావంతులకు స్త్రీ శక్తి సౌరశక్తి విద్యుత్ సంస్థలో ఉద్యోగ అవకాశం కల్పిస్తోందని ఉదయ్ కుమార్ తెలిపారు.

విగ్రహ నిర్మాణ గద్దె కూల్చివేత



నవతెలంగాణ-గజ్వేల్

అహల్య బాయ్ హెూంల్కర్ విగ్రహా గద్దె నిర్మాణాన్ని బుధవారం రాత్రి మున్సిపల్ సిబ్బంది కూల్చివేసినట్లు హైందవ సోదరులు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని క్యాసారం చౌరస్తాలో భారత తొలి మహిళా నాయకురాల్లో ఒకరైన ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంతో గద్దెను నిర్మించారు. అనుమతి ఉన్నదా లేదా అనేది పక్కకు పెడితే నిర్మాణదారులను ముందుగా సంప్రదించి చర్యలు తీసుకుంటే బాగుండేదని స్థానికులు అంటున్నారు. సమాచారం ఇవ్వకుండానే గద్దెను కూల్చడం సమంజసం కాదన్నారు. సంఘట స్థలాన్ని బీజేపీ నాయకులు మనోహర్ యాదవ్, నాయిని సందీప్ తదితరులు సందర్శించారు.

జాతీయ మహిళా కబడ్డీకి సిద్దిపేట జిల్లా క్రిడాకారిణి



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత అరు ఏండ్లుగా అనేక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటూ సీనియర్ జాతీయస్థాయి మహిళా కబడ్డీ పోటీలకు బి.రాణి ఎంపికైనట్టు జట్టు నిర్వాకులు తెలిపారు. ఈ గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని సిద్దిపేట జిల్లా కబడ్డీ జుట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించి మంచి ప్రతిభ కనబర్చిడంతో, అక్కడ రాష్ట్ర స్థాయి క్యాంప్ ట్రయల్స్‌కి ఎంపికైనప్పుడు కబడ్డీ అసోసియేషన్ ప్రకటించింది. బుధవారం జరిగిన ఫైనల్ ఎంపికల్లో రాష్ట్ర కబడ్డీ జట్టులో చోటు దక్కించుకుందన్నారు. నేటి నుంచి అనగా 14 నుండి 18వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. ఈ సీనియర్ జాతియ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి ఎంపికపట్ల సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

రైతాంగం పట్ల మోసపూరిత ప్రకటనలు మానుకోవాలి

- కాంగ్రెస్ ముసుగులో ఉన్న జేఏసీ నాయకులు రైతాంగానికి క్షమాపణ చెప్పాలి
- తపాస్ పల్లి రిజర్వాయర్ నీటితో ఈ ప్రాంత చెరువు, కుంటలు నింపాలి
- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

రైతాంగం పట్ల మోసపూరిత ప్రకటనలు మానుకోవాలని, తపాస్ పల్లి రిజర్వాయర్ నీటితో చేర్యాల ప్రాంత చెరువులు, కుంటలు నింపాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ(ఎం)కార్యాలయంలో గురువారం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సత్తిరెడ్డి మాట్లాడుతూ చేర్యాల ప్రాంతంలో ఉన్న చెరువులు, కుంటలు నింపడం కోసం నిర్మించిన తపాస్ పల్లి రిజర్వాయర్ నీటిని కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా నీటిని జీవో లేకుండానే యదేచ్ఛగా తీసుకుపోతుంటే స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఏం చేస్తున్నాడో ప్రజలకు చెప్పాలన్నారు. తప్పుడు ప్రకటనలు చేసే కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని నిలదీయాలని, చేతకాకుంటే జేఏసీ, కాంగ్రెస్ నాయకులు చేర్యాల అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి ప్రజలకు, రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చేతకాని వారిలాగా చూస్తూ కూర్చున్న కాంగ్రెస్ నాయకులు జేఏసీ పేరుతో రైతులను మోసగించే ప్రకటనలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ ప్రాంతం మీద ప్రేమ ఉంటే నీటిని తీసుకుపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రిజర్వాయర్ నీటిని ఈ ప్రాంతంలో ఉన్న అన్ని చెరువులు, కుంటలు కాలువల ద్వారా నింపాలని, కాలువల లేని చెరువులకు కాలువలు తవ్వి నింపాలని, లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో రైతులను, ప్రజలను ఏకం చేసి చెరువులు, కుంటలు నింపే వరకు ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాడూరు రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తే మట్టెలు పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ వనిత వారి ఆధ్వర్యంలో రచ్చ దేవదాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆర్థిక సాయంతో కళ్యాణి వివాహానికి పుస్తే మట్టెలు, చీర, గాజులు అందించినట్లు వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ గవర్నర్ మంకాల నవీన్ కుమార్, డీఎస్‌ఓ చింత రాజేంద్రప్రసాద్, జోన్ చైర్మెన్ అర్వపల్లి హరికిరణ్, వాసవి కుటుంబ సురక్ష పథకం చైర్మెన్ జైన సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా

- దేవునూరి రవీందర్

నవతెలంగాణ-దుబ్బాక

ఉద్యోగులు,నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్ హామీ ఇచ్చారు. త్వరలో జరగబోవు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. గురువారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని కోర్టు కార్యాలయంలో బార్ కౌన్సిల్ అధ్యక్షులు బాబూరావుతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. 25 ఏళ్లుగా న్యాయవాదిగా సేవలందిస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతోమందికి ఉచితంగా న్యాయ సాయం అందించానని గుర్తు చేశారు. బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా నిరుద్యోగులకు సేవలు అందించడమే ధ్యేయంగా సంకల్పించి పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని,దుబ్బాక నియోజకవర్గంలోని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.ఆయన వెంటఅడ్వకేట్లు జనార్దన్ రెడ్డి,మహేష్, శ్రీనివాస్ పలువురున్నారు.



విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడలు

- మూడు రోజులపాటు క్రీడా పోటీలు
- హాజరైన వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

వ్యవసాయ పాలిటెక్నిక్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వేదిక అయింది. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసేందుకే క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల డైరెక్టర్ డా. సిహెచ్ వేణు గోపాల్ రెడ్డి, మధ్య మండల వ్యవసాయ ఉప సంచాలకులు డా.ఉమారెడ్డిలు అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి క్రీడలును ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. రాష్ట్రంలో ఉన్నటువంటి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కంపాసాగర్, పాలెం, మాల్తుమ్మెద, జోగిపేట, తోర్నాల, రుద్రూరు, మధిర, కంది, జమ్మికుంట, బసంతపూర్, నారాయణపేట కళాశాల క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. క్రీడాకారులకు అబినందనలు తెలిపారు. ఆటల ద్వారా జీవితంలో ఏదైనా సమస్య వస్తే దానిని పరిష్కరించుకునే టువంటి సత్తా మీ లోపల ఉండాలని కోరారు. మూడు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహించనుండగా, వివిధ జిల్లాలకు చెందిన 211 మంది విద్యార్థులు హాజరయ్యారు. వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, త్రోబాల్, టెన్నికాయిట్, రన్నింగ్, జావలిన్ త్రో లో వారు పోటీపడనున్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ క్రీడా పోటీల పరిశీలకులు సురేష్, జిల్లా వ్యవసాయ అధికారిని టి. రాధిక, తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి మాతృవియోగం


ఫైల్

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, తల్లి మధురమ్మ, (85) అనారోగ్యంతో గురువారం సిద్దిపేటలోని ఓ ఆసుపత్రిలో మృతి చెందారు. మధురమ్మ పార్థివ దేహాన్ని స్వగ్రామమైన దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి తీసుకువచ్చారు. మధురమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, ఉన్నారు. మృతురాలి కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు.

తండ్రి, కొడుకులు మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం




నవతెలంగాణ-దౌల్తాబాద్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి కొడుకులు మృతిచెందగా వారి కుటుంబానికి పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ గ్రామంలో బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబానికి సహాయం చేయడం వారి కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ముత్యం రెడ్డి, పీఆర్టీయూ దౌల్తాబాద్ మండల శాఖ అధ్యక్షులు ఎం. రాజిరెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షులు వంగ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు అభినందనలు

- దొమ్మట గ్రామస్తులు



నవతెలంగాణ-దౌల్తాబాద్

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం హైదరాబాద్ మందకృష్ణ మాదిగ నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు ఈదన్నగారి సింహాచలం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం ఉద్యమాలు గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటిం చడం పట్ల మాదిగ సమాజం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మెర వెంకట్ రెడ్డి, కానుగుల కనకయ్య, ఎండి.శాబీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు

- చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శశిధర్ రాజు



నవతెలంగాణ-రాయపోల్

రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమ వ్యాపారులు కొనుగోలు చేసి రీసైకిలింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికి అందిస్తున్నారని, ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలంగాణ చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శశిధర్ రాజు అన్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేందర్ సింగ్ ఆదేశాల మేరకు రాయపోల్ మండలం రామారం గ్రామ శివారులో గల సాయి మహాదేవ్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో బుధవారం ఉదయం విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్, టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. సుమారు 863 బ్యాగులు, 431 క్వింటాళ్ల బియ్యం, రూ.15,51,600. విలువగల బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సాయి మహదేవ్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్ యజమాని నవీన్ ప్రభుత్వానికి 1,660 టన్నుల బియ్యం బాకీ ఉండడంతో రెండు సీజన్లు ప్రభుత్వం ఈ రైస్ మిల్ కు సీఎంఆర్ ఇవ్వలేదన్నారు. గుట్టుగా వివిధ వాహనాల నుంచి రేషన్ బియ్యంను తీసుకొచ్చి మళ్ళీ వాటిని రీసైకిలింగ్ చేసి బియ్యాన్ని వివిధ జిల్లాలకు కామారెడ్డి, హన్మకొండ,ములుగు, సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు రైస్ మిల్ లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సాయి మహదేవ్ రైస్ మిల్ లీజుకు తీసుకొని నడిపిస్తున్న సాయి కుమార్ రెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తొగుట సిఐ లతీఫ్ తెలిపారు. బియ్యాన్ని దౌల్తాబాద్ పౌర సరఫరాల గోదాంకు తరలించి మిల్ ను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట డీఎస్‌ఓ తనుజ, చౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి. ప్రవీణ్, ఏఎస్‌ఓ అనిల్ కుమార్, డి.ఎస్.పి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు

గజ్వేల్ గడ్డ పై గర్జించనున్న నేతలు




నవతెలంగాణ- గజ్వేల్

అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్‌లు గజ్వేల్ గడ్డపై గర్జించనున్నయి. ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా ఈ సభలను ఏర్పాటు చేసుకొని ఒకరి లోపాలు మరొకరు ఎత్తిచూపడంతో పాటు విమ ర్శలకు ప్రతి విమర్శలకు కాలు దువ్వుతున్న నేపథ్యంలో గజ్వేల్ వేదికగా మారనున్నది. వారి వారి స్థాయిలో జన సమీకరణ చేసి అధికార కాంగ్రెస్ లోపాలను ఎత్తి చూపెందుకు కెసిఆర్ సిద్ధమవుతున్నారు. అధికా రంలోకొచ్చి ఏడాదిలో ఎంతో సాధించామని ఇది ప్రజలకు వివరించేందుకు గజ్వేల్ అసెంబ్లీలో కేసీఆర్ పై తమ బలమెంతో చూపిందుకు సీఎం రేవంత్ రెడ్డి గజ్వేల్ లోసభ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పాలనపై వ్యతిరేకతను కేసీఆర్ ఎజెండాతీసుకుని ముందు వెళుతున్నారు. వర్గీకరణ, కులగనన, అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ ఈ సభపై ఫోకస్ పెట్టింది. అంతే కాకుండా రానున్న స్థానిక ఎన్నికల లక్ష్యంగా ఇరు పార్టీలు కయ్యానికి కాళ్లు దువ్వుతున్నాయి.

శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు రుణాలు అందజేత

- యూబీఐ చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కరరావు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సిద్దిపేటలో వివిధ రకాల శిక్షణలు పొందిన 12 మంది మహిళలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం సిద్దిపేట ఆధ్వర్యంలో గురువారం రుణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా యూబీఐ చీఫ్ జనరల్ మేనేజర్ కే. భాస్కర రావు మాట్లాడుతూ వివిధ అంశాలపై శిక్షణ పొంది స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనుకున్న మహిళలకు చేయూతగా ఒక్కొకరికి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు రుణ మంజూరు పత్రాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శిక్షణ పొంది అర్హత కలిగిన వారందరికీ, స్వయంగా వ్యాపారాన్ని నిర్వహించాలని తపన ఉన్న వారికి వివిధ ప్రభుత్వ బ్యాంక్ పథకాల ద్వారా రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సిద్దిపేట రీజనల్ హెడ్ వికాస్, డిప్యూటీ రీజినల్ హెడ్ రాఘవ, ఆర్సిటీ సంస్థ డైరెక్టర్ రాజలింగం, చీఫ్ మేనేజర్ పద్దీస్, సంజయ్, చైతన్య ఆర్సిటీ సిబ్బంది నజీమ్, నాగరాజు, ప్రశాంత్, స్వప్న తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

- మర్కుక్‌లో ఘనంగా స్వయంపాలన దినోత్సవం

నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు మారి తోటి విద్యార్థులకు పాఠశాల భోదించి అందరిని ఆకట్టుకున్నారు. స్వయం పరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా సౌమ్య, కలెక్టర్‌గా వెంకటేష్, ఎంఈవోగా నవ్య, అడిషనల్ కలెక్టర్‌గా హర్షన్, డీఈవోగా దివ్య, ఉపాధ్యాయులుగా 40 మంది వారి వారి తరగతి గదుల్లో బోధనను సాగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, భూజాత, వందన, రమేష్, శ్రీనివాసరావు , నాగేశ్వరరావు , పద్మా రెడ్డి, రమణారావు, గణేష్, తదితరులున్నారు.



జాతర కమిటీ అధ్యక్షునిగా ముని



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని తంగళ్ళ పల్లి గ్రామ సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షునిగా అర్షనపల్లి ముని ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. గురువారం సమ్మ క్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా పాము సత్తయ్య, ముఖ్య సదహదారు లుగా బండిపల్లి నారాయణ గౌడ్, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. అలాగే ఉపాధ్య క్షులుగా యాటెల్లి రాజ మౌళి, ప్రధాన కార్యదర్శిగా పిల్లి అంజయ్య, కోశా ధికారిగా పాము బాలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే పూజారులుగా చె ప్యాల సత్త య్య చిట్టి కనకయ్య అంజయ్య, పరివేద కొమురయ్య, దు బ్బుల శ్రీనివాస్ ప్రచారకర్తలుగా మమ టం పంతులు కనకయ్య, చెప్యాల చంద్ర య్య, అర్శనపల్లి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా పిల్లి కనకయ్య, నాగవెల్లి వెంకటేష్, శ్రీరామ్ యాటల శంకర్, చిగిరి కొమురయ్య, పులి నారాయణ, వెల్ది బాల య్య ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షులు ముని మాట్లాడు తూ నాపై నమ్మ కంతో ఏకగ్రీవంగా ఎన్ను కున్న సభ్యులందరికీ ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తునికిఖాల్సాలో యూనియన్ బ్యాంక్ సేవలు

నవతెలంగాణ-వర్గల్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ హైదరాబా ద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ కర్రే భాస్కర్ రావు అన్నారు. మండలంలోని తునికిఖాల్సా గ్రామంలో యూనియన్ బ్యాంక్ నూతన శాఖను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని రకాల సౌకర్యాలతో నూతన శాఖను ఏర్పాటు చేశామన్నారు. దేశ వ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అతి తక్కువ వడ్డీకి రుణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ వికాస్, బ్యాంక్ మేనేజర్ సందీప్ హెచ్ నార్సాగ్, బ్యాంక్ సిబ్బంది, వినియోగదారులుపాల్గొన్నారు



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శుక్రవారం | 14 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

ఎన్నికల నిర్వహణకు గ్రామస్తులు సహకరించాలి

- చేర్యాల ఎస్ఐ పీ.నీరేశ్

నవతెలంగాణ-చేర్యాల

ఎన్నికలు నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని చేర్యాల ఎస్ఐ పీ.నీరేశ్ కోరారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరన్నపేట, ముస్త్యాల గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని, ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి అని వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని,గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దన్నారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించిన, ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొబిషనరీ ఎస్ఐ మానస రెడ్డి, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా అందరు ఆశీర్వాదించాలి

-పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, పట్టభద్రులు, ఉద్యోగులు తనను ఆశీర్వదించాలని డాక్టర్ బండారి రాజ్ కుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని కొండా భూదేవి గార్డెన్‌లో ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగుల జాబ్ క్యాలెండర్ అమలు చేసే విధంగా పోరాడుతానని, నిరుద్యోగాన్ని తొలగించడానికి రూ.5 వేల కోట్లతో ఉపాధిని కల్పించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ప్రవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు కనీస వేతనం వచ్చే విధంగా పోరాడుతానని, ఉద్యోగ భద్రత, ఇతర ప్రయోజనాలు కల్పించే విధంగా ఒప్పందాలు ఉండేలా కృషి చేస్తానని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు వచ్చే విధంగా, ఉద్యోగ భద్రత కల్పించే విధంగా కృషి చేస్తా అన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

-ప్రజల అనూహ్య స్పందన మరింత బాధ్యత పెంచింది
-ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ జీఎం నిశాంత్



నవతెలంగాణ-మనోహరాబాద్

ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి ఇచ్చిన అనూహ్య స్పందనతో తమపై మరింత బాధ్యతను పెంచిందని పరిశ్రమ జనరల్ మేనేజర్ నిశాంత్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రంగయ్య పల్లె-చెట్లగౌరారంలో గల ఎమ్మెస్ అగర్వాల్ కంపెనీ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధులతో మెడినోవా హాస్పిటల్స్, కొంపల్లి సౌజన్యంతో రంగయ్యపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో అన్నీ రకాల వైద్య సేవలు అందించిన వైద్యులు అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది వరకు వైద్య సేవలను పొందారు. ఈ శిబిరంలో సంస్థ ఇతర ప్రతినిధిలు రాజకుమార్, పాషా, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషాపై వెంకటాయపల్లి విద్యార్థుల అద్భుత ప్రతిభ

-ఆంగ్లంపై పలు రకాల ప్రదర్శనలు
-జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పి.శారద



నవతెలంగాణ-తూప్రాన్

మండలంలోని జడ్పీహెచ్ఎస్ వెంకటాయపల్లి ప్రధానోపాధ్యాయురాలు పి.శారద ఆధ్వర్యంలో ఆంగ్లభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఆంగ్ల భాషకు సంబంధించిన వివిధ రకాల ప్రదర్శనలు నిర్వహించి ఉపాధ్యాయుల సమక్షంలో పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. అదేవిధంగా విద్యార్థినీ, విద్యార్థులు ఆంగ్ల భాషలో ఉపన్యాసాలు ఇచ్చారు. ఆంగ్ల భాషలో నెమలి చిత్రంతో ఆంగ్లానికి సంబంధించిన వ్యాకరణ అంశాలను అద్భుతంగా పొందుపరిచి ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఆంగ్ల వ్యాకరణాలకు సంబంధించిన అంశాలను వివిధ ఆకృతులలో అద్భుతంగా ఆంగ్ల వ్యాకరణాలపై అద్భుతమైన చిత్రాలు ప్రదర్శించిన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఈ రెండు విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సిద్ధిరాములు, శివకుమార్, వసుధ, రతన్, జ్యోతి, పద్మ, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఎంపికైన పోలీసులకు శిక్షణ

జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

నవతెలంగాణ-మెదక్



జిల్లాలోని అన్ని పోలీస్టేషన్లలో కొత్తగా నియామకమైన పోలీస్ సిబ్బందికి అదనపు ఎస్పి ఎస్.మహేందర్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్.పి. ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిక్షణలో సిసిటిఎన్ఎస్, ఈ-సాక్ష్య, దర్పన్, సిఈఐ ర్ పోర్టల్, సైబర్ అవేర్నెస్, ఈ చాలన్ వంటి తదితర అప్లికేషన్స్‌పైన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధ్యమైనంత వరకు ఉపయోగించుకొని తక్కువ సమయంలో సులభ మార్గంలో నేరాలను శోదించవచ్చని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ మధుసూధన్ గౌడ్, ఎన్ఎస్ సిబ్బంది అనిల్, సిద్ధు, రవితేజ ఐటీ కోర్ సిబ్బంది విజయ్ మహేందర్ గౌడ్ , వెంకట్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు..



- మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్
- పట్టణంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

నవతెలంగాణ-సిద్దిపేట

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ప్రజలను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్‌లో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సమయంలో మహిళ తన గృహం ఆవరణలో చెత్తను కాల్చడం గమనించిన కమిషనర్ వెంటనే ద్విచక్ర వాహనం దిగి చెత్త బహిరంగ ప్రాంతాల్లో వేయడమే తప్పు అలాంటిది ఎందుకు కాల్చివేస్తున్నారు, ప్రతిరోజు ఉదయాన్నే ప్రతి ఇంటింటికి వచ్చే మున్సిపల్ వారి చెత్త వాహనానికి చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి ఇవ్వాలని మహిళకు అవగాహన కల్పించారు. మరోసారి ఇది పునరావృతం అయితే జరిమానా విధిస్తామన్నారు. ఆ మహిళచే నీటిని తెప్పించి మంటలు ఆర్పించారు. కోమటి చెరువు వద్ద మహిళలు నీటిని వృధా చేయడం గమనించి వెంటనే వారిని పిలిచి ప్రతిరోజు ఉదయాన్నే మున్సిపల్ సిబ్బంది సరఫరా చేసే మంచినీటిని వృధా చేయకూడదని, సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గల హాస్టల్ వద్ద



సామ్సంగ్ కస్టమర్ సర్వీస్ నిర్వాహకురాలు తమ ఇంట్లో వెలువడిన చెత్తను ఇంటి ఆవరణలో వేయడం గమనించి వెంటనే మహిళను పిలిచి ఇలాంటి కమర్షియల్ వేస్ట్‌ను సాయంత్రం వేళలో వచ్చే బేసిల్ ఫౌండేషన్‌కి వారికి మాత్రమే అందజేయాలని బహిరంగ ప్రదేశాలు వేయకూడదని అవగాహన కల్పించారు. 10 వార్డులో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో నూతనంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో వెంటనే అట్టి నిర్మాణాన్ని నిలిపివేయా లని దేవరాజుని ఆదేశించారు. మెదక్ రోడ్డు వైపున మాంసం విక్రయదారుల వద్దకు వెళ్లి అట్టి మాంసాన్ని స్లాటర్ హౌస్ లో వధించారా లేదా అని పరిశీలించారు. అట్టి మాంసంపై స్లాటర్ హౌస్‌లో వేసే ముద్ర లేకపోవడంతో వారికి జరిమానా విధించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ప్రజా ప్రతినిధులు బింగి రాజేశం, నాయకం లక్ష్మణ్, అధికారులు శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధిలో అన్యాయం

-మట్టి అక్రమ రవాణను నియంత్రించాలని స్థానికుల వినతి

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పదిధిలోని పోతారం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంలో స్థానికులకు ఉపాధిలో అన్యాయం జరుగుతోందని మండలంలోని అయా గ్రామాలకు చెందిన యువత అధికారులను డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని పోతారం గ్రామ శివారులో నిర్మిస్తున్న వైట్ ఫీల్డ్ ఇథనాల్ పరిశ్రమకు స్థానికేతరుల మట్టి అక్రమ రవాణను యువత అడ్డుకున్నారు. అధికారులు వివక్ష చూపకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తూ న్యాయం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

డయల్ 100కు ఫిర్యాదు

మట్టి అక్రమ రవాణపై డయల్ 100 యువత ఫిర్యాదు చేశారు. డయల్ 100 ఫిర్యాదుపై పోలీసులు తక్షణమే స్పందించి మట్టి అక్రమ రవాణ చేస్తున్న వాహనాలను పోలీస్ స్టేషనుకు తరలించారు.



పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

-జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్

నవతెలంగాణ-గజ్వేల్

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులపై ఎటివో గజ్వేల్ కార్యాలయాన్ని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ల నాగరాజు, గోక విద్యాసాగర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగులో ఉన్న మెడికల్, జీపీఎఫ్ లోన్స్, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్, సరెండర్, ఇతర బకాయిలు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష రూపాయలుపై బడిన బిల్లులు విడుదల చేయకపోవడం, వలన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. అనంతరం సంఘం డైరీని ఎటివో, ఎస్టివోకు అందజేశారు.



యూపీఎస్‌పై యుద్ధభేరిని విజయవంతం చేయాలి

- టీఎస్సీపీఎస్ఈయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కురాకుల శ్రీనివాస్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) విధానంకు వ్యతిరేకంగా హైదరాబాద్ లో జరిగే యూపీఎస్‌పై యుద్ధభేరిని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కురాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజ్, మోడల్ స్కూల్ , కేజీబీవీ పాఠశాలలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ వద్దంటూ రాష్ట్ర వ్యాప్తంగా దశాబ్ద కాలంగా పోరాటం జరుగుతున్నదని చెప్పారు. కొత్తగా యూపీఎస్ పేరుతో ఉద్యోగుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు తాకట్టు పెడుతుందని



ఆరోపించారు. దీనివల్ల ఉద్యోగుల జీవితాలు మరింత దుర్భరం అవుతాయనీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి గాని ఉద్యోగులకు గాని ఏ విధంగానూ భద్రత కల్పించబోదని అన్నారు. యూపీఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, సీపీఎస్ నుంచి యూపీఎస్‌కు వెళ్లే విధానాన్ని అదే శాఖ తయారు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మార్చి 2న హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ లో యూపీఎస్ పై యుద్ధభేరికి రాష్ట్రంలోని రెండు లక్షల యాభై వేల సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దేవరాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి శశి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై ప్రజలకు నమ్మకం లేదు

- స్థానిక ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలిచేలా చూడాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

దేశంలో నరేంద్ర మోడీ తీసుకువచ్చిన కొత్త చట్టాలతో ప్రజలకు మేలు చేస్తారని ప్రజలకు ఏమాత్రం నమ్మకం లేదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. గురువారం హుస్నాబాద్ సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక క్రిమినల్ చట్టాలు ఉన్నాప్పటికి పాలకులు చట్టల అమలులో నిర్లక్ష్యంతో ప్రజలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో పరిపాలకులు సగానికి పైగా ప్రజల ఓట్లతో గెలిచాక ప్రజా గోడు పట్టించుకోవడం లేదన్నారు. పార్లమెంటులో ఉన్న ప్రజా ప్రతినిధులు సగానికి పైగా నేరచరిత్ర ఉన్న వాళ్లే ఉన్నారని, దీంతో ప్రభుత్వ అధికారులు చట్టాలను అమలు చేయకుండా సరిగ్గా పని పని చేయడం లేదని, అందువల్లే ప్రజలకు అన్యాయం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నన భోజన వంట మనుషులైన పేదలకు నెల నెలా బిల్లులు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించి ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సిట్లు గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త నాయకులు నిర్విరామంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బొయిని అశోక్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

పిపిఎల్ సీజన్ 3 విజేతలకు రూ. 25 వేల నగదు

నవతెలంగాణ-కొల్చారం

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఒక ఓటమి మరో విజయానికి నాంది పలుకుతుం దని అప్పాజీపల్లి మాజీ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకు లు నాయిని వెంకట్ గౌడ్ (గజిని) అన్నారు. గురువారం మండలం లోని పోతంశెట్టిపల్లి గ్రామంలో (పిపిఎల్) సీజన్-03 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫైనల్ మ్యాచ్‌లో విన్నర్‌గా గెలుపొందిన విజేతలకు వెంకట్ గౌడ్ రూ.25 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ గౌడ్ మాట్లాడుతూ క్రీడల్లో ఓడినా గెలిచినా క్రీడా నైపుణ్యం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అలాగే క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయని, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడలు క్రమశిక్షణకు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లబోయిన దుర్గేష్ ముదిరాజ్, రామకృష్ణ, ఉదయ్, విన్నర్ టీం సభ్యులు యువకులు పాల్గొన్నారు.



దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బర్మ కొమురయ్య, తునికి మహేష్



నవతెలంగాణ-కొండపాక

కొండపాక గ్రామ పంచాయతీ సిబ్బంది నర్సింలును యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బర్మ కొమురయ్య, తునికి మహేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి జరిగి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటికి మండల అధికారులు స్పందించాకపోవడం, చాలా దారుణమన్నారు. గ్రామాల్లో పని చేస్తున్న సిబ్బంది దళితులు కావున చిన్న చూపు చూస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి నర్సింలుకు వైద్య పరీక్షలు చేయించాలని డిమాండ్ చేశారు. అధికారులు చెప్పారని గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల హెూర్డింగులు తొలగిస్తుతున్నా సందర్భంగా ఒక రాజకీయ పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారాని. నర్సింలు పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించే విదంగాజిల్లా పంచాయతీ అధికారులు స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకునే విదంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా కార్మికులను ఐక్యం చేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు తునికి శ్రీకాంత్, జాలిగామ ప్రభాకర్, కార్మికులు నర్సింలు, సుధాకర్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు గ్రామపంచాయతీ ఎన్నికల శిక్షణ

-ఆర్డీవో ఎం.జయచంద్రారెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్



వివిధ మండలాలకు చెందిన స్టేజ్ టు రిటర్నింగ్ అధికారులకు సాధారణ గ్రామపంచాయతీ 2025 ఎన్నికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డిఓ ఎం.జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మనోహరాబాద్, నార్సింగి, మాసాయిపేట, వెల్దుర్తి, చేగుంట, తూప్రాన్ మండలాలకు చెందిన ఎన్నికల స్టేజి 2 రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పలు సూచనలు సలహాలు చేశారు.

పౌర్ణమి రోజు జరిగే యజ్ఞంను ఆరు నెలల వాయిదా

నవతెలంగాణ-మిరుదొడ్డి

గత కొద్ది రోజులుగా ఊరిలో ఒకరి తరువాత ఒకరు మరణించడంతో మోతే గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. దాంతో గ్రామంలో ప్రజలంతా సుఖ సంతోషంతో ఉండాలని గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో కోనేరు బావిని పునర్నిర్మించాలని, గ్రామంలో బొడ్రాయిని నిర్మించాలని, పౌర్ణమి సందర్భంగా జరిగే యజ్ఞమును ఆరు నెలలకు వాయిదా వేయాలని గ్రామ సభలో తీర్మానించడం జరిగింది అన్నారు.



IN THE COURT OF THE
HON'BLE SENIOR CIVIL JUDGE
RANGA REDDY DISTRICT,
AT : CHEVELLA
I.A. No. 842 OF 2022
IN
O.S. No. 465 OF 2022

BETWEEN:
SMT.D.MANGAMMA, and OTHERS Rep by her GPA Holder M. Ramdin Durgesh Singh
... PETITIONERS/PLAINTIFFS
AND
C.MUKHESH SINGH AND OTHERS
...RESPONDENTS/DEFENDANTS

R-5. SMT. KOKUTTAM HEMA LATHA W/o. Christofer, Aged about 56 years, Occ: Employee R/o: Quarter No. 103-A, BDL Township, Bhanur Village, Patancheru Mandal,Sanga Reddy District- 502319

NOTICE

Please take notice that the above named plaintiffs have filed the above suit for Partition--Recovery of Possession in respect of suit schedule property agricultural dry land bearing Sy.No. 230/28, measuring Ac. 1-04 gts, Shankarpalli village and Mandal, Ranga Reddy District and in Sy.No. 29/AA measuring Ac.1-03gts, situated at Yelvarthy village, Shankarpalli Mandal, Ranga Reddy District against you and other defendants on the file of the Hon'ble Senior Civil Judge Court, Chevella. Along with the said suit, the petitioners/ plaintiffs have also filed the above I.A.No.842/2022. The above petition/ suit is posted for your appearance before this Hon'ble Court. Therefore, you are hereby to appear before the above said Hon'ble Court on. **10.03.2025 at 10.30 am** either in person or through your counsel failing which the matter will be decided on merits.

//BY ORDER OF THE COURT//
CHOWDARY YADAVA REDDY
(COUNSEL FOR PETITIONERS/ PLAINTIFFS)